# కాంగ్రెస్ కోటకు బీటలు

- 2018 ఎన్నికల్లో చెక్‌పెట్టిన బీఆర్‌ఎస్
- బండ్ల గెలుపుతో కుటుంబ పాలనకు స్వస్తి
- నాలుగున్నరేండ్లలో రూ.1,044 కోట్లతో నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- గులాబీ జెండాకు అండగా ఓటర్లు
- మళ్లీ గెలుపు తథ్యమంటున్న విశ్లేషకులు

## నియోజకవర్గ ప్రొఫైల్



గద్వాల ఎస్పీ కార్యాలయం

గద్వాల, అక్టోబర్ 31 : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గద్వాల నియోజకవర్గం విద్యా, వైద్య పరంగా వెనుకబడిపోయింది. కృష్ణమోహన్‌రెడ్డి గెలిచిన తర్వాత విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగారు. ఐదేండ్ల కాలంలోనే 60ఏండ్ల అభివృద్ధిని సీఎం కేసీఆర్ సహకారంతో చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్ధానాన్ని నెరవేర్చడంతోపాటు ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గోసపడ్డ నడిగడ్డ ప్రస్తుతం అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నది.

### నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు..

గద్వాల నియోజకరవ్గం ఏర్పడిన తర్వాత 1952లో మొదటిసారి సాధరణ ఎన్నికల నాటి నుంచి 2014 వరకు 8మంది 16సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అందులో డీకే కుటుంబం 40 ఏండ్లపాటు ఎమ్మెల్యేలుగా పాలన సాగించారు. జిల్లా ఏర్పాటైన తర్వాత 2018లో మొదటిసారి గద్వాల కోటపై గులాబీ జెండాను బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎగురవేసి కుటుంబ పాలనకు స్వస్తి చెప్పారు. 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణను కృష్ణమోహన్‌రెడ్డి 28,445 ఓట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించారు. 2018లో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ముందు 15ఏండ్లు అధికార దర్పం అనుభవించిన ఈ ప్రాంత మాజీ ఎమ్మెల్యే డీకే అరుణ తన మేనల్లుడు కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో చిత్తయ్యారు. అరుణకు 2009, 2104లో వచ్చిన మొత్తం మెజార్టీ కంటే కృష్ణమోహన్‌రెడ్డికి వచ్చిన మెజార్టీ 28,445తో తుడిచి పెట్టుకపోయింది. 2016 సంవత్సరానికి ముందు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలు కలిపి 9మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా ఉండేది. జిల్లాల ఏర్పాటు సమయంలో తొమ్మిదిగా ఉన్న మండలాలను గద్వాల, అలంపూర్‌ను కలిపి మొత్తం 12 మండలాలతో జోగులాంబ గద్వాల జిల్లాగా ఏర్పాటు చేశారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి, రాజోళి, గద్వాల నియోజకవర్గంలోని కేటీదొడ్డిని ప్రభుత్వం కొత్త మండలాలుగా ఏర్పాటు చేసింది. దీనికితోడు ప్రభుత్వం ఎర్రవల్లి చౌరస్తాను కొత్త మండలంగా ప్రకటించడంతో ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లా 13 మండలాలతో రూపుదిద్దుకున్నది. 2104లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఇక్కడ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి పట్టం కట్టారు. కృష్ణమోహన్‌రెడ్డికి పదవి లేకున్నా ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.126కోట్లు నిధులు తె చ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లారు. అవే విజయానికి నాంది పలికాయి.

| పార్టీ | గెలుపు |
|---|---|
| కాంగ్రెస్ | 7 |
| టీడీపీ | 2 |
| ఇండిపెండెంట్లు | 3 |
| సమాజ్‌వాది పార్టీ | 1 |
| జనతాదళ్ | 1 |
| బీఆర్‌ఎస్ | 1 |

### వైద్యరంగంలో ముందడుగు..

ఈ నాలుగున్నరేండ్లలో గద్వాల వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధించింది. గతంలో చిన్న, చిన్న ప్రమాదాలకు కర్నూల్ లేదా హైదరాబాద్‌కు తరలించే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దవాఖానలో 100 పడకలు ఉండగా, రూ.49.16లక్షలతో 300పడకలుగా పెంచి ఆధునిక హంగులతో దవాఖాన నిర్మిస్తున్నారు. నర్సింగ్ కళాశాల మంజూరు చేయించి ఈ ప్రాంత విద్యార్థులు నర్సింగ్ విద్యను అభ్యసించే అవకాశం కల్పించారు. మెడికల్ కళాశాల మంజూరుకు కృషి చేశారు. భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పల్లె దవాఖానలు ఏర్పాటు చేయించారు. జిల్లా దవాఖానలో రోగుల సౌకర్యార్థం ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేసి 133 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఐసీయూ, డయాలసిస్, ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం, సెంట్రల్ మెడికల్ స్టోర్, రేడియాలజీ విభాగం ఏర్పాటు చేశారు.

### రైతు సంక్షేమం కోసం..

గతంలో ఈ ప్రాంతం సాగునీటిపరంగా వెనుకబడిపోయింది. ప్రస్తుతం నెట్టెంపాడ్ ఎత్తిపోతల పథకం ద్వారా 1.30లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. గట్టు ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే మరో 33వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకకాశం ఉంది. గద్వాల నియోజకరవ్గంలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి రైతు వేదికలు ఏర్పాటు చేశారు. కరువుతో బాధపడుతన్న గట్టు ప్రజలకు గట్టు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. దీంతో 33వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నది.

## గద్వాలలో ఐదేండ్లలో చేపట్టిన అభివృద్ధి

- జిల్లా కేంద్రంలో రూ.69,1475కోట్లతో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం.
- గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రతి గ్రామంలో రూ.45.20కోట్లతో 247 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం.
- రూ.18కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం.
- రూ.6కోట్లతో నూనతబస్ స్టేషన్ ఏర్పాటు.
- రూ.6.25కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం.
- రూ.25కోట్లతో ఆర్వోబీ నిర్మాణం.
- రూ.1.75కోట్లతో సంగాల పార్కు అభివృద్ధి.
- రూ.52కోట్లతో నూతన కలెక్టరేట్, రూ.581కోట్లతో ఎస్పీ కార్యాలయం నిర్మాణం.
- రూ.10కోట్లతో మహిళా పీజీ కళాశాల, వసతి గృహం.
- రూ.1.5కోట్లతో మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు తరగతి గదులు.
- గట్టు ఎత్తి పోతల పథకం పనులు ప్రారంభంతోపాటు పల్లెప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.
- జూరాల ప్రాజెక్టు వద్ద బృందావన్ గార్డెన్
- జిల్లా గ్రంథాలయానికి నూతన భవనం మంజూరు
- జిల్లా దవాఖానలో రేడియాలజీ, ఐసీయూ, ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు.
- కేసీఆర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు ఉచిత కోచింగ్
- పేదల కడుపు నింపడానికి రూ.5కే భోజనం (కేసీఆర్ క్యాంటిన్)
- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లు, డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేత.
- యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందజేత
- నియోజకరవ్గంలో లోవోల్టేజీ సమస్య తీర్చడానికి 17 సబ్‌స్టేషన్లు, 1,600 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు.
- నాలుగున్నరేండ్లలో గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.1044కోట్ల 24లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

# తాసీల్దార్‌కు బెయిలబుల్ వారెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : స్థానికంగా ఉంటున్నట్లు సర్టిఫికెట్లు జారీ చేసిన కేసులో హైకోర్టు విచారణకు హాజరుకాని అలంపూర్ తాసీల్దార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాసీల్దార్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నవంబర్ పదో తేదీన జరిగే తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తాను తెలంగాణకు చెందిన అభ్యర్థినే అయినా లోకల్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇచ్చేందుకు కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం నిరాకరించిందంటూ ఎస్ .వెన్నెల హైకోర్టులో పిటిషన్ వేశారు. తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మిషన్ (ఎంబీబీఎస్ , బీడీఎస్ కోర్సులలో ప్రవేశం) నిబంధన-2017లోని 3(III)(బి) ప్రకారం విద్యార్థిని స్థానికుడిగా పరిగణించాలంటే అర్హత పరీక్ష(నీట్)కు ముందు నాలుగేళ్లు తెలంగాణలోనే చదివి ఉండాలని స్పష్టం చేస్తోందని, ఈ నిబంధన రాజ్యాంగంలోని 14వ అధికరణం ఉల్లంఘిస్తోందని గతంలో ఇదే హైకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి నిబంధనను తప్పుబడుతూ గతంలో సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉ త్తర్వులు కూడా ఇచ్చిందని తెలిపింది. శాశ్వత నివాసితులైన విద్యార్థులను 'స్థానికంగానే పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పును తనకు కూడా వర్తింపజేయాలని వెన్నెల కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్ వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని గత విచారణ సందర్భంగా హైకోర్టు తేల్చి చెప్పింది. స్థానికంగా లేకున్నా విద్యార్థి 18 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నట్లు సర్టిఫికెట్ ఎలా ఇచ్చారో చెప్పాలని తహసీల్దార్ ను ఆదేశించింది. మంగళవారం తహసీల్దార్ హాజరుకాకపోవడంపై బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

# రేవంత్‌వి రౌడీ రాజకీయాలు

- కాంగ్రెస్ బరితెగించి హత్యలు చేసేలా ప్రోత్సహిస్తున్నది
- హత్యారాజకీయాలను తెలంగాణ సమాజం క్షమించదు
- కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాణాలు కాపాడిన గన్‌మెన్‌కు సెల్యూట్
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 : రేవంత్‌రెడ్డి రౌడీ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటిని తెలంగాణ సమాజం క్షమించదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం దారుణమన్నారు. మొండి కత్తి అని దుర్మార్గంగా మాట్లడడం రేవంత్‌రెడ్డి మానసిక స్థితిని తెలియజేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను మెప్పించి వారి మనసులు గెలవాలే తప్పా ఇలాంటి అరాచకాలు చేయడం పిరికి పంద చర్యగా మంత్రి అభివర్ణించారు. ఇలాంటి వారిని రాజకీయంగా పూర్తిగా భూస్థాపితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పొరపాటున అధికారం ఇస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటూ కార్యకర్తలను రెచ్చగొట్టి వారితో దాడులు చేయించడం, తిరిగి సమర్థించుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందనే కుట్రతో ప్రభాకర్‌రెడ్డిని హత్య చేయించేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య అన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందన ను చూసి ఓర్వలేక కుట్రతో ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి లక్షలాది మంది కార్యకర్తల బలగం ఉన్నదని, అనుకుంటే ఇలాంటి వారికి గుణపాఠం చెప్పగలమని, కానీ తమకు ఆ సంస్కృతి లేదన్నారు. ఒక్క క్షణం మా కార్యకర్తలు సహనం కోల్పోతే దాడి చేసిన వాడు ముక్కలు ముక్కలుగా అయ్యేవాడని తెలిపారు. చట్టంపై తమకు అపారమైన గౌరవం ఉన్నదని కార్యకర్తలు నిందితుడిని పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. గన్‌మెన్‌లేకుంటే ఆ సమయంలో ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి ఏమిటని, తలచుకుంటనే ఎంతో అవేదన కల్గుతుందని తెలిపారు. కాపాడిన గన్‌మెన్‌కు సెల్యూట్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి చికిత్సకు సంబంధించిన ఫొటోలను మంత్రి మీడియాకు చూపించారు. పోలీసులను బట్టలూడదీసి ఉరికించి కొడతామని రేవంత్ అన్నారని, టచ్ కూడా చేయలేరని హెచ్చరించారు. తెలంగాణ పోలీస్ పనితీరుతో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారని ప్రసంశించారు. సమావేశంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మూడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, నాయకులు శేఖర్, రామకృష్ణ, కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.